క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



పొదలకూరు: మండలంలోని విరువూరు ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి వసంతరాయులు డెంగీ జ్వరానికి గురై నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేదలైన విద్యార్థి తల్లిదండ్రులు వెంకటరమణయ్య, ప్రవళ్లికకు బహుజన టీచర్స్ అసోసియేషన్ నేతలు రూ.15,500ల ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. బీటీఏ రాష్ట్ర కార్యదర్శి ఊట్ల రఘు, మండల అధ్యక్షుడు వడ్డే హజరత్తయ్య, ప్రధాన కార్యదర్శి కె.శీనయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.చక్రపాణి పాల్గొన్నారు.

డ్రోన్లతో నిఘా



కాగితాలపూరు క్రాస్‌రోడ్డు వద్ద ఇలా..

మనుబోలు: మండల కేంద్రంలోని సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసులు బుధవారం డ్రోన్లతో నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఎస్సై శివరాకేష్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మనుబోలు హైవే, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలపై డ్రోన్లు ఎగురవేసి ఫొటోలు తీయించినట్లు తెలిపారు. మద్యం తాగే ప్రాంతాలు, నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న టీచర్లు

కొడవలూరు: వేసవి శిక్షణలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో ప్రైవేట్ పాఠశాలల టీచర్లు ఎస్.దేవసేన, కె.షీబారాణి, జి.మాధవి, కె.భార్గవి రామాయణం, మహాభారతంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంకా కొడవలూరు గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం లైబ్రేరియన్ కె.రాజేశ్వరి నీతి కథలను ల్యాప్‌టాప్‌లో ప్రదర్శించారు.

రూ.85 లక్షలతో పశువుల షెడ్ల నిర్మాణం



నీటి తొట్టెను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మనుబోలు: మండలంలో పశువుల షెడ్ల నిర్మాణానికి రెండో విడతలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.85.10 లక్షలు మంజూరైనట్లు ఎంపీడీఓ జలజాక్షి తెలిపారు. మండలంలోని మడమనూరు గ్రామంలో పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 37 షెడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే వేసవి కాలంలో పశువులకు తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వ స్థలాల్లో 27 తొట్టెలను నిర్మిస్తున్నామన్నారు.

నీటి ఎద్దడి నివారణకు రూ.65 లక్షలు



ట్యాంక్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మనుబోలు: మండలంలోని కొలనకుదురు గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు జల్‌జీవన్ నిధులు రూ.65 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రెడ్డయ్య తెలిపారు. పైపులైన్ ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కట్టువపల్లి గ్రామం వద్ద ఉన్న సంపు నుంచి పైపులైన్ ద్వారా 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొలనకుదురులోని వాటర్ ట్యాంక్‌కు నీరు సరఫరా చేస్తామని తెలిపారు. బద్దెవోలు పంచాయతీ పరిధిలోని పల్లెపాళెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను ఆయన పరిశీలించారు. ట్యాంక్ నుంచి గిరిజన కాలనీకి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. ఆయన వెంట డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ కసనానాయక్, క్వాలిటీ కంట్రోల్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ శ్రీకాంత్ ఉన్నారు.

వ్యర్థ జలాలతో ముప్పు

- చనిపోతున్న చేపలు
- ఆవేదన చెందుతున్న గిరిజనులు

ఇందుకూరుపేట: ప్రాసెసింగ్ ప్లాంట్ల నుంచి వచ్చే వ్యర్థ జలాల కారణంగా మండలంలోని గంగపట్నం చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. దీంతో స్థానిక గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. ఈ చెరువులో గంగపట్నం, కొమరిక, నరసాపురం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు వేట సాగిస్తుంటారు. ఇటీవల చేపలు చనిపోయి ఒడ్డుకు చేరడంతో వారంతా లబోదిబోమంటున్నారు. వలకు చిక్కిన మత్స్యసంపద సైతం పనికి రాకుండా పోయింది.

ఇదే కారణం

డేవిస్‌పేట, జగదేవిపేట తదితర గ్రామాల్లో ఉన్న రొయ్యల ప్రాసెసింగ్ ప్లాంట్లు సమీపాన ఉన్న గంగపట్నం, మైపాడు పంట కాలువల్లోకి నేరుగా వ్యర్థ జలాలను వదిలేస్తున్నాయి. దీంతో చేపలు చనిపోతున్నాయని గిరిజనులు చెబుతున్నారు. రెండు, మూడేళ్ల క్రితం ఇదే విధంగా చెరువులో చేపలు చనిపోయినట్లు వారు తెలిపారు. గతంలో ఈ నీటి వల్ల పంటలు దెబ్బతినడం, వివిధ అంశాలపై పలుమార్లు జగదేవిపేట రైతులు సైతం



చనిపోయిన చేపలు

నిరసనలు వ్యక్తం చేశారు. అప్పుడు తాత్కాలికంగా నీటి విడుదలను ఆపిన ప్లాంట్లు మళ్లీ వదిలేస్తున్నాయి. వ్యర్థ జలాలను రసాయనాలతో శుద్ధి చేసి బయటకు పంపాల్సి ఉంది. అది ఖర్చుతో కూడిన పని. దీంతో వ్యర్థ జలాలను విడుదల చేసే పైపులైన్లు బయటకు కనిపించకుండా కాలువులో ఏర్పాటు చేశారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా జరిగిన ఘటనపై అధికారులు స్పందించాలని గిరిజనులతోపాటు రైతులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



రాత్రి చెరువులో వలవేసి ఉదయం వచ్చి చూసేసరికి చేపలు చనిపోయి ఉన్నాయి. వ్యర్థ జలాలతోనే ఈ పరిస్థితి ఏర్పడి ఉంటుంది. మళ్లీ ఇలా జరగకుండా చూడాలి.

– కె.శ్రీనయ్య, గంగపట్నం

చెరువుపై ఆధారపడి జీవిస్తున్నాం



చెరువుపై ఆధారపడి గంగపట్నం, కొమరిక, నరసాపురానికి చెందిన పలువురు గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇటీవల చేపలు చనిపోయి. కొన్నేళ్ల క్రితం ఇలాగే జరిగింది. ఇలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

– వెలుగు శ్రీనివాసులు, గంగపట్నం

మరపురాని నేత కాకాణి రమణారెడ్డి



పొదలకూరులో రమణారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన నేతలు

పొదలకూరు: మెట్ట ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి ఎందరో జీవితాల్లో వెలుగులు నింపిన కాకాణి రమణారెడ్డి మరపురాని నేత అని వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తెలిపారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తండ్రి రమణారెడ్డి వర్ధంతిని బుధవారం ఆయన స్వగ్రామం తోడేరు, ఇంకా పొదలకూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముందుగా తోడేరులో రమణారెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని సంగం రోడ్డు సెంటర్, మండల పరిషత్ కార్యాలయం సమీపంలో రమణారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేశారు. వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, దాసరి భాస్కర్‌గౌడ్, మందల వెంకటశేషయ్య, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, రావుల దశరథరామయ్యగౌడ్, వాకాటి శ్రీనివాసులురెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఎంపీటీసీలు కేతు రామిరెడ్డి, జి.శ్రీనివాసులు, వార్డు సభ్యులు ఎస్కే అంజాద్, హేమంత్, ఏనుగు శశిధర్‌రెడ్డి, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మొగళ్లూరు గ్రామంలో రమణారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సచివాలయానికి సమీపంలో ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి, కాకాణి రమణారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడాకారులతో వీఎస్‌యూ అధికారులు తదితరులు

- మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

వెంకటాచలం: 'విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి. తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలి' అని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. వెంకటాచలం మండలం కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న జాతీయ స్థాయి పురుషుల సాఫ్ట్‌బాల్ పోటీలను మంత్రి బుధవారం వీక్షించారు. ఆరు జట్ల మధ్య హోరాహోరీగా మ్యాచ్‌లను నిర్వహించారు. విజయం సాధించిన నాలుగు జట్లు గురువారం జరిగే పోరులో పాల్గొంటాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను వీఎస్‌యూలో నిర్వహించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పోలినాయుడుచెరువు గ్రామం ముస్లిం కాలనీకి చెందిన రఫీ అనే వ్యక్తి హత్య కేసులో 8 మందిని బుచ్చి పోలీసులు అరెస్ట్ చేశారు. బుచ్చిరెడ్డిపాళెం సీఐ శ్రీనివాసరెడ్డి బుధవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. వర్గపోరు, ఆధిపత్యం కోసమే గతనెల 29వ తేదీన నాగాయగుంటవద్ద రఫీని రంతుల్లా, ఖాదర్‌బాషా, బాజీ, పఠాన్ ఖాదర్‌బాషా, యాసిన్, మౌలాలీ, దాదాసాహెబ్, షఫీ అహ్మద్ హత్య చేశారు. జనవరి నెలలో పోలినాయుడుచెరువు గ్రామంలో గంధ మహోత్సవం జరిగింది. రఫీ అతని అనుచరులు చందాలు వసూలు చేసి కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో ఆర్కెస్ట్రా, డ్యాన్స్ ప్రోగ్రాం పెట్టలేదని నిందితులు రఫీతో గొడవపడ్డారు. చందాల నగదును సొంత అవసరాలకు వాడుకున్నారని దుర్భాషలాడారు. అప్పటి నుంచి కక్ష పెంచుకుని నాగాయగుంట వద్ద పొలం పనికి వెళ్లి వస్తున్న రఫీని అడ్డగించి కత్తితో పొడిచి, రాళ్లు, కర్రలతో కొట్టి చంపారు. పరారీలో ఉన్న నిందితులను మంగళవారం పోతిరెడ్డిపాళెం ఆర్చి వద్ద అరెస్ట్ చేశామని సీఐ వివరించారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఎస్పీ జి.కృష్ణకాంత్ అభినందించారు.

గాంధీ ఆశ్రమంలో రవీంద్రనాథ్ జయంతి

ఇందుకూరుపేట: మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని కో-కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. రవీంద్రనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆశ్రమంలోని గాంధీజీ, స్థల దాత కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అలాగే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని నిర్వహించారు. ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత

కొడవలూరు: వేసవి సెలవుల్లో గండవరం జెడ్పీ హైస్కూల్ హిందీ పండిట్ జి.నాగభూషణం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. హిందీ సబ్జెక్ట్‌లో కాస్త వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి ఇళ్లకు వెళ్తున్నారు. ఆ భాష సులువుగా నేర్చుకునేందుకు ఆయన స్వీయ రచనలో రూపొందించిన 'బునియాద్' పుస్తకాన్ని అందజేస్తున్నారు. రోజూ ఆ పుస్తకంలోని ఒక పేజీని చదువుతూ చూసి రాయాలని వారికి సూచిస్తున్నారు. ఏవైనా సందేహాలుంటే ఫోన్ ద్వారా నివృత్తి చేసుకోవాలని చెబుతున్నారు. ఈ సందర్భంగా హిందీ పండిట్ మాట్లాడుతూ గతేడాది వేసవి సెలవుల్లో ఈ విధంగా చేయడంతో పదో తరగతిలో హిందీ సబ్జెక్ట్‌లో వంద శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.

భారత సైన్యానికి సెల్యూట్

కోవూరు: భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రమూకలకు గట్టి సమాధానం ఇచ్చిందని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ సైన్యానికి అండగా నిలబడి వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని ప్రసన్న కోరారు. ఉగ్రవాద స్థావరాలపై దాడులను ఆయన స్వాగతించారు.

తోటపల్లిగూడూరు: 'ఉగ్రమూకలపై ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత సైన్యానికి సలాం. పాకిస్తాన్ ఇప్పటికైనా ఉగ్రవాదానికి స్వస్తి పలకాలి' అని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ విజయ డెయిరీ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి అన్నారు. తోటపల్లిగూడూరులో ఆయన బుధవారం మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులు పర్యాటకులను చంపడం హేయమైన చర్యగా వెల్లడించారు. భారత్ సైనిక దళాలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

కేన్సర్‌పై అవగాహన పెంచాలి

- ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండ్యన్



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న కమిషనర్

కొడవలూరు: ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్త సంయుక్తంగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి కేన్సర్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశించారు. మండలంలోని కమ్మపాళెంలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 104 వాహనంలో వైద్య పరికరాలు, మందులన్నీ ఉన్నాయా? అని పరిశీలించారు. సర్వేలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అవసరమైన మందులు అందజేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ 'అభ' ఐడీ కార్డులు విధిగా చేయాలని చెప్పారు. కేన్సర్ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ యశ్వంత్, ఎన్‌సీడీ మానిటరింగ్ టీం సభ్యులు డాక్టర్ వినూత, డాక్టర్ శాంతి, పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, హెచ్ఏ సీహెచ్ సుధాకర్, ఏఎన్ఎం టి.రాధమ్మ పాల్గొన్నారు.

సీహెచ్‌సీ వద్ద నిరసన



పొదలకూరు: యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు 15 రోజులుగా చేస్తున్న సమ్మెలో సీనియర్స్ అయిన ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు, డాక్టర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఖండిస్తూ బుధవారం స్థానిక సీహెచ్‌సీ వద్ద ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, రాధాకుమారి, వెంకటేశ్వర్లు, సాని శివప్రసాద్, హైమావతి అరుణ, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కోవూరు: మండలంలో వరి నారుమడులు దాదాపు పూర్తయ్యాయని, రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు సుజాత తెలిపారు. కోవూరులోని పలు ప్రాంతాల్లో పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఎక్కువగా కేఎన్ఎం 1632 రకం వేశారన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు చైతన్య, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి



గౌతమ్ నగర్‌లో పోస్టర్ల ప్రదర్శన



రామన్నపాళెంలో..

కొడవలూరు: వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. కిశోరి వికాసం స్పెషల్ సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మండలంలోని రామన్నపాళెం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ ప్రభావతి పాల్గొన్నారు.

రామాపురం అంగన్‌వాడీ కేంద్రం - 2 లో కిశోరి వికాసం - వేసవి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఇంకా గౌతమ్ నగర్‌లో సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ మాట్లాడారు. మహిళా పోలీస్ ఆర్.తేజస్విని, ఏఎన్ఎం కె.వితలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.రాధిక, బి.ప్రియదర్శిని, పి.ఉమ, హెల్పర్ డి.రాజేశ్వరి పాల్గొన్నారు.

రంగంలోకి పోలీస్ బాస్

- మిస్టరీగా రియల్టర్ హత్య కేసు
- సాంకేతికత ఆధారంగా కొనసాగుతున్న దర్యాప్తు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో సంచలనం రేకెత్తించిన రియల్టర్ చిన్నయ్య హత్య కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. పక్కా పథకంతో హత్య చేసి కారం చల్లి చిన్నపాటి ఆధారం దొరకకుండా జాగ్రత్తలు తీసుకోవడాన్ని బట్టి నిందితులు ప్రొఫెషనల్ కిల్లర్స్ అయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. హత్య జరిగి 24 గంటలవుతున్నా దర్యాప్తు ముందుకు సాగకపోవడంతో ఎస్పీ జి.కృష్ణకాంత్ స్వయంగా రంగంలోకి దిగారు. బుధవారం ఆయన ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర డీఎస్పీ పి.సింధుప్రియ, ఫోరెన్సిక్ నిపుణుల ప్రత్యేక బృందం, చిన్నయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన వైద్యుడితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్, వైద్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మరోమారు డాగ్ స్క్వాడ్‌తో హత్యా స్థలం, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయించారు. హత్య జరిగిన రోజు చిన్నయ్యతోపాటుగా అదే ఇంట్లో ఉన్న ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లును ఎస్పీ విచారించారు. అనంతరం కేసు ఛేదనకు సంబంధించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రత్యేక బృందాలు ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో, సమీప ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించినా చిన్నపాటి ఆధారం లభ్యం కాలేదు. మృతుడి ఫోన్ కాల్ వివరాలు, టవర్ డంప్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు మృతుడికి తన స్వగ్రామంతోపాటు కలిగిరిలోనూ పలువురితో భూ, ఆర్థిక సంబంధమైన విభేదాలున్నాయని, పలువురు అతడి వల్ల జైలుపాలైనట్లు, కొందరిని మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. వారేమైనా ఈ ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారా అనే కోణాల్లోనూ పోలీసులు విచారిస్తున్నారు. వివాహేతర సంబంధాలున్నాయా అని విచారణ సాగుతోంది. హత్య ప్రొఫెషనల్ కిల్లర్స్ పనేనని భావిస్తున్న పోలీసులు ఈ తరహా హత్యలకు పాల్పడే వారి వివరాలు సేకరిస్తున్నారు. ఏది ఏమైనా అన్ని కోణాల్లో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

పూరిల్లు దగ్ధం

పొదలకూరు(ముత్తుకూరు): మండల కేంద్రమైన ముత్తుకూరు ఇందిరమ్మ కాలనీలో బుధవారం పూరిల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ఇల్లు తగులబడి గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

అవగాహన సదస్సు నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీహరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంపై ఆక్వా రైతులకు సమగ్ర అవగాహన కల్పిస్తామని వివరించారు. మత్స్యశాఖ జిల్లా అధికారులు హాజరవుతారని వెల్లడించారు.